క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిక



తోటకూర నాగేశ్వరరావుకు పార్టీ కండువా వేస్తున్న సీఎం జగన్

రాజానగరం: టీడీపీకి చెందిన స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు తోటకూర నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీలో చేరారని ఆ పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద ఆదివారం ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి గోదావరి జిల్లా కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు సమక్షంలో మేమంతా సిద్ధం బస్సుయాత్ర ద్వారా రాజానగరం వచ్చిన సీఎం జగన్‌ను ఆయన కలుసుకున్నారన్నారు. పార్టీలో చేరేందుకు ఆసక్తి వ్యక్తపర్చడంతో పార్టీ కండువా మెడలో వేసి, ఆహ్వానం పలికినట్టు తెలిపారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి, దేవరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకాలు పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం అన్నసమారాధన కొనసాగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వారందరూ స్వామివారి దర్శనం చేసుకున్న తర్వాత అన్నప్రసాదం స్వీకరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం



స్వీప్ ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న నీనా నిగమ్

రాజమహేంద్రవరం రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్వీప్ ఫొటో ప్రదర్శన కలెక్టర్ మాధవీలతతో కలిసి ఆదివారం సాయంత్రం తిలకించారు. నీనా నిగమ్ మాట్లాడుతూ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి 85 ఏళ్లు పైబడిన ఓటర్లు ఆసక్తి కనబర్చడం శుభసూచకమన్నారు. అయితే పట్టణాల్లో ఓటు హక్కును వినియోగించుకునేవారి శాతం తక్కువగా ఉంటుందన్నారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లు ముందుకు వచ్చి ఓటు వేయడం వారందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఉందని, దానిపై వారికి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అంతకు ముందు మీడియా మానిటరింగ్ సెల్, చెక్‌పోస్టుల సీసీ కెమెరాల పర్యవేక్షణ, సువిధ, సీవిజిల్, ఎంసీసీఎంసీ తదితర విభాగాలను పరిశీలించారు.

సామాజిక న్యాయానికి జగన్ పెద్దపీట

రాజమహేంద్రవరం సిటీ: సామాజిక న్యాయం గురించి మాటలు చెప్పడమే కాకుండా చేతల్లో చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఓఎన్‌జీసీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎంఆర్ శేఖర్ అన్నారు. ఆయన శనివారం జనసేన పార్టీకి రాజీనామా చేసి, పాయకరావుపేటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం స్థానిక పేపర్ మిల్లు మెయిన్ గేట్ ఎదురుగా గల శ్రీకృష్ణసాయి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు అభినందన సత్కారం నిర్వహించారు. డీఎంఆర్ శేఖర్ మాట్లాడుతూ ఎన్నో ఆశయాలు, ఆశలతో సామాజిక న్యాయం కోసం జనసేనలో చేరినప్పటికీ నిరాశే మిగిలిందన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు బాగా చదువుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను సీఎం జగన్ తీర్చిదిద్ది, సౌకర్యాలు కల్పించి ఇంగ్లిషు మీడియం ప్రవేశపెడితే దాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యతిరేకించడం వింతగా అనిపించిందన్నారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా శేఖర్ పనిచేసినప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించి, అంబేడ్కర్ విగ్రహాలు, నీటిబోర్డులు సమకూర్చారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేత
- చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చేశారు. అదే రీతిలో అంగన్‌వాడీ కేంద్రాలను సైతం ఆధునీకరిస్తున్నారు. అంగన్‌వాడీలను ప్రీ స్కూళ్లుగా మార్చి చిన్నారులను ఆకట్టుకునేలా ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నారు. అంతేకాకుండా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా పౌష్టికాహార కిట్లు అందజేస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను పోషకాహార నిలయాలుగా మార్చారు.

అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు, పెదపూడి, అనపర్తి, రంగంపేట మండలాల్లో మొత్తంగా 265 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల్లో అందించే మధ్యాహ్న భోజనం మెనూలో సమూల మార్పులు తీసుకొచ్చారు. దీనివల్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారం అందుతుంది. పాలు, గుడ్లు, జొన్న పిండి, రాగిపిండి, అటుకులు, చిక్కీలు, ఖర్జూరంతో కూడిన పౌష్టికాహార కిట్లు అందజేస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను నివారించడానికి కృషి చేస్తున్నారు. మరోవైపు గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలతో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలకు చేరువ చేశారు. గత ఐదేళ్లగా అంగన్‌వాడీల్లో తీసుకొచ్చిన మార్పులతో ప్రజలు తమ చిన్నారులను కేంద్రాలకు పంపించేందుకు మొగ్గు చూపుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం మెనూ

సోమవారం:	అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు కూర, పాలు
మంగళవారం:	పులిహోర, టమాటా పప్పు, ఉడికించిన గుడ్డు, పాలు
బుధవారం:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, పాలు
గురువారం:	అన్నం, ఆకుకూర, సాంబార్, ఉడికించిన గుడ్డు, పాలు
శుక్రవారం:	అన్నం, బీరకాయ లేదా సొరకాయ పప్పు, మునగాకు కూరతో ఉడికించిన గుడ్డు, పాలు
శనివారం:	వెజిటబుల్ రైస్, ఆకుకూర, సాంబార్, ఉడికించిన గుడ్డు, పాలు

పౌష్టికాహారం ఇస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. పిల్లలకు మంచి చదువు, నాణ్యమైన భోజనం అందించడమే కాకుండా గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం పౌష్టికాహార కిట్లు ఇవ్వడం అభినందనీయం.

– తోట లక్ష్మి, లబ్ధిదారు, కాపవరం

చదువుతో పాటు ఆటలాడిస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చదువుతో పాటు ఆటలాడిస్తున్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంచి సౌకర్యాలు కల్పించింది.

– రాపాక దుర్గా ప్రవల్లిక, లబ్ధిదారులు, తొస్సిపూడి

సీతారాముల పుష్పయాగం



సీతారాములకు సమర్పించిన సారె

బిక్కవోలు: శ్రీరామనవమి పురస్కరించుకుని మండలంలోని పందలపాక వెలంపేట రామాలయం వద్ద సీతారాముల పుష్పయాగం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు కాజాలు, చలివిడి, అరిసెలు, సున్నుండలు, లడ్డూలు, పాలకోవాలు తదితర 58 రకాల స్వీట్లు, పిండి పదార్థాలను సతీమ్మ సారెగా తీసుకొచ్చి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చీపురుపల్లి ఆనందరావు, సబ్బారపు చిన్నా, వైకుంఠ వెంకటేశ్వరరావు, గొర్రిపోటి వెంకటరమణ, బొడ్డు ముత్యాలరావు, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



కూనవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కూనవరంలో ఎన్నికల ప్రచారం



కూనవరంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలు చేపడతారని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కూనవరంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిసి సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. జగన్ సీఎం అయితేనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తిరిగి ప్రతి గడపకూ చేరతాయన్నారు. కూనవరం అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నామని, రోడ్డు నిర్మాణ పనులు కూడా వేగవంతం జరుగుతున్నాయన్నారు. కూటమి పార్టీలు అధికారం కోసమే పొత్తు పెట్టుకున్నాయని, ప్రజలకు సేవ చేయడానికి కాదన్నారు. ఈ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఇచ్చే ఆచరణ సాధ్యం కాని హామీలను నమ్మవద్దన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మాజీ ఎంపీపీ పెండ్యుర్తి దేవదాసు, సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఉప సర్పంచ్ మండపాక గణేష్, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, సుంకర నరసింహం, అయిల పాపారావు, అయిల మాధవరావు, నల్లమోలు నూకరాజు, అయల రంగా, కొండాటి సతీష్, ఉమ్మిడిశెట్టి వీరన్న, అయిల ఉపేంద్ర పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ పథకాలు

- జక్కంపూడి గణేష్ భార్య సుకీర్తి
- రఘుదేవపురంలో ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ సుకీర్తి

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయని ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి డాక్టర్ సుకీర్తి అన్నారు. మండలంలోని రఘుదేవపురంలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. పేదల అభ్యున్నతికి నవరత్నాల పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. చంద్రబాబు అండ్ కోను ప్రజలు నమ్మబోరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, పార్టీ నాయకులు పిండి రాధాకృష్ణ, గెద్దాడ త్రిమూర్తులు, యలమాటి కాశీ, పంతుల శ్రీను, పిసిని రాజేష్, కాంద్రు వెంకట్రాజు, పెండుర్తి భగవాన్, పాలచర్ల అచ్యుత రామారావు, పైడి రాజా, ఏపుగంటి సత్తిబాబు, ఎజ్జేడ గురుమూర్తి, అడ్డాల ప్రసాద్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సమన్యాయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వడిశలేరులో ఇంటింటా ఎన్నికల ప్రచారం



వడిశలేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ సమ న్యాయం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని వడిశలేరు గ్రామంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి దంపతులు, సొసైటీ చైర్మన్ పోతుల బులి వీర్రాజు తదితరులు పూలజల్లులతో సాదర స్వాగతం పలికారు. ముందుగా స్థానిక దేవాలయాల్లో పూజలు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్షమైన పాలన కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలో పారదర్శకమైన పాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ వారిని ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్రంలో 33 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పార్టీ కన్వీనర్ నలమాటి భీముడు తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ మిమ్మల్నే ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం అంటూ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని దీవిస్తున్న వృద్ధురాలు

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

ప్రకాశం నగర్: జక్కంపూడి కుటుంబంపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని జక్కంపూడి మిత్ర మండలి నాయకుడు కొత్తపేట రాజా అన్నారు. తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వారి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. మెగా ఫ్యామిలీ కోసం తన ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమని, అయితే అభిమానం వేరు, రాజకీయం వేరు అన్నారు. రాజానగరంలో జక్కంపూడి రాజా గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. బత్తుల బలరామకృష్ణ వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు. జక్కంపూడి రాజా వెనుక మెగా అభిమానులు ఉన్నారని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్.సందీప్, మురళీ, రఘు, భాస్కర్, రాజేష్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- అనపర్తి, దుప్పలపూడిల్లో ఎన్నికల ప్రచారం



గోవిందరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె స్థానిక మార్కండేయపురం, గోవిందరెడ్డినగర్, బాబానగర్‌తో పాటు దుప్పలపూడి పరిధిలోని గాయత్రీనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. గడప గడపకూ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అన్నీ కొనసాగుతాయని, ప్రజలకు మరింత సంక్షేమం చేకూరుతుందని చెప్పారు. వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీలు కొండేటి భీమేష్, తుమ్మా రాజేశ్వరి, సత్తి దొరయ్య రెడ్డి, వల్లభశెట్టి సతీష్, మల్లిడి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి ఆటవిడుపు

- మే ఒకటి నుంచి చిన్నారులకు క్రీడా శిక్షణ శిబిరాలు
- అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 50 సెంటర్ల ఏర్పాటు
- చర్యలు తీసుకున్న శాప్

ప్రకాశం నగర్: వేసవి కాలంలో వివిధ రకాల క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒక కేంద్రంలో కనీసం 25 మంది బాలురు, 25 మంది బాలికలకు వారి ఆసక్తిని బట్టి అండర్ - 14 విభాగంలో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, హ్యాండ్ బాల్, టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఆసక్తి కలవారు క్రీడ, ప్రాంగణం, ఇన్‌చార్జి, మొబైల్ నంబర్, చిరునామా వివరాలతో ఈజీడీఎస్ రాజమహేంద్రవరం ఎట్‌దరైట్ ఆఫ్ జీమెయిల్.కమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇలా వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి, అర్బన్, రూరల్‌లలో 50కి తగ్గకుండా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడల్లో ప్రతిభ కనబరించేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. క్రీడాకారులకు వారికి నచ్చిన ఆటలో శిక్షణ ఇవ్వడంతో పాటు మెళకువలు నేర్పుతారు.

– డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్

నెల రోజుల శిక్షణ

క్రీడా శిక్షణ తరగతులు మే ఒకటి నుంచి ఆ నెల చివరి వరకూ జరుగుతాయి. వీటిని సుమారు నెల రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం స్కూల్ గేమ్స్ జగనన్న క్రీడా సంబరాలతో పాటు ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడా పోటీలను ఎంతో సమర్థంగా నిర్వహించింది.



ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

క్రీడలకు పెద్ద పీట

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసి, క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. క్రీడాకారులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తుంది. గతంలో వివిధ పోటీలు జరిగినప్పుడు క్రీడాకారులకు భోజనం, వసతి సదుపాయాలను దాతల సహకారంతో ఏర్పాటు చేసేవారు. జగన్ పాలనలో ప్రభుత్వంలో వాటిని అందజేస్తుంది. క్రీడాకారులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, స్నాక్స్ వంటివి సమకూర్చుతోంది.



బాక్సింగ్‌లో మెళకువలు నేర్చుకుంటున్న పిల్లలు (ఫైల్)

నవ వధువుపై కుటుంబ సభ్యుల దాడి

కడియం: ప్రేమ వివాహం చేసుకున్న యువతిపై ఆమె కుటుంబ సభ్యులు దాడి చేశారు. కడియంలోని ఆదివారం జరిగిన ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. నరసారావుపేటలోని ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో చదువుతుండగా నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం గొడిగనూరు గ్రామానికి చెందిన జి.స్నేహకు కడియం గ్రామానికి చెందిన బత్తిన వెంకటనందుతో పరిచయం ఏర్పడింది. వీరు విజయవాడ కనకదుర్గ గుడిలో ఈనెల 13వ తేదీన వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లికి అబ్బాయి తరఫున అంగీకారం తెలిపారు. ఈ నేపథ్యంలో కడియంలోని వెలుగుబంటి రామచంద్రరావు కల్యాణ మండపంలో ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంపై అమ్మాయి తరఫు వారికి కూడా సమాచారం ఇచ్చి ఆహ్వానించారు. అయితే స్నేహ కుటుంబ సభ్యులైన పద్మావతి, చేరన్ కుమార్, చందు, నక్క భరత్ ఫంక్షన్ హాల్‌లోకి ప్రవేశించి వాగ్వాదానికి దిగారు. స్నేహ కళ్లలో కారం చల్లి కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. ఆమెను భర్త వెంకట నందు రక్షించాడు. నిందితులు స్నేహ దగ్గర నుంచి బంగారు గొలుసు, ఉంగరం, చెవి రింగులు లాక్కెళ్లారు. అక్కడే ఉన్న బత్తిన వీరబాబుపై దాడి చేశారు. గాయపడిన అతడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.